క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి పూజలు



సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వేంకటేశ్వర స్వామివారి మూల విగ్రహాలను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి అభిషేక పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

విద్యానైపుణ్యాలను పెంపొందించాలి



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: విద్యార్థులలో విద్యా నైపుణ్యాలను పెంపొందించి, వారి విద్యాభివృద్ధికి పాటుపడాలని ఎంఈఓ జ్యోతి ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రం సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఎంఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఉపాధ్యాయులతో మాట్లాడారు. కాంప్లెక్స్ సమావేశంలో చర్చించే అంశాలు విద్యార్థుల పురోగతి దోహదపడేలా ఉండాలన్నారు. తెలుగు, గణితం, జీవశాస్త్ర పాఠ్యాంశాలపై రీసోర్సు పర్సన్స్ (ఆర్‌పీలు) ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

మానవ సంబంధాలపై అవగాహన



మాట్లాడుతున్న మహమ్మద్‌మీయా

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు శనివారం మానవ సంబంధాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ మీయా, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సభ్యుడు శేషాద్రి రెడ్డి సందేశం ఇచ్చారు. మనిషి విలువ, సమాజంతో పౌరుడి బాధ్యత తదితర విషయాలను విశదీకరించామని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

సన్మానం



ఎస్‌ఐ వెంకట సుబ్బయ్యను సన్మానిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

గడివేముల: నందివర్గం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన గడివేముల ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య శనివారం ప్రజాప్రతినిధులు, పోలీసులు ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి, ఉపసర్పంచ్ బాలచెన్ని, ఎంపీటీసీ మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐకి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. మహిళా పోలీసులు ఎస్‌ఐకి ఘనంగా వీడ్కోలు పలికి సెల్ఫీ తీసుకున్నారు.

ముగిసిన ఎస్‌ఎంసీ ఎన్నికలు



కంబదహాల్ మెయిన్ స్కూల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తున్న హెచ్‌ఎం నాగన్న

సి.బెళగల్: మండలంలో 31 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్, మోడల్, కేజీబీవీ, గురుకులం పాఠశాలలతో కలిపి మొత్తం 46 ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు పూర్తి చేశామని ఎంఈఓ జ్యోతి తెలిపారు. ఈనెల 8వ తేదీన కోరంలేక వాయిదా పడిన కంబదహాల్ గ్రామ మెయిన్, బీసీ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంలు నాగన్న, నాగేశ్వర రావు, కే.సింగవరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మన్న శనివారం ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారన్నారు. చైర్మన్లుగా పరుశురాముడు, రాజశేఖర్, నారాయణ ఎన్నికయ్యారని ఎంఈఓ తెలిపారు.

కొండలరాయుడికి... తేళ్లే నైవేద్యం!



కోడుమూరు కొండపై వెలసిన కొండలరాయుడు



చేతులపై తేళ్లను ఉంచుకున్న దృశ్యం (ఫైల్)



స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు (ఫైల్)

- శ్రావణమాసం మూడవ సోమవారం ప్రత్యేకం
- దశాబ్దాలుగా కొనసాగుతున్న వింతాచారం
- తేలు కుట్టినా ఏమి కాదంటున్న భక్తులు
- రేపే కొండ్రాయుడికి ప్రత్యేక పూజలు

కోడుమూరు రూరల్ : దేవుళ్లకు పండ్లు, ఫలహారాలు, కానుకలు సమర్పిస్తారు భక్తులు. కొందరు భక్తులు ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యం సమర్పిస్తుంటారు. మరికొందరు భక్తులు ఆలయాలకు వెళ్లి అక్కడే నిద్రచేసి నైవేద్యం తయారు చేసి స్వామివార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకుంటుంటారు. అయితే కోడుమూరు కొండపై వెలసిన కొండలరాయుడు మాత్రం ఏకంగా తేళ్లను నైవేద్యంగా స్వీకరిస్తారు. అదికూడా ఏడాదికి ఒక్కసారి మాత్రమే. ప్రతి యేడాది శ్రావణమాసంలో వచ్చే మూడవ సోమవారం ఈ వింత ఆచారాన్ని కోడుమూరులో దశాబ్దాలుగా కొనసాగుతుంది. ఈ వింత ఆచారం రేపు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య సాగనుంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా కొండలరాయుడిని దర్శించుకుని తేళ్ల నైవేద్యంగా సమర్పించేందుకు తరలిరానున్నారు. ఈ మేరకు స్వామివారి ఆలయం ముస్తాబు అయ్యింది. భక్తులకు తాగునీరు తదితర వసతులు సమకూర్చినట్లు ఆలయ సంరక్షకుడు మనోహర్‌రెడ్డి తెలిపారు.

చిన్నారులు సైతం తేళ్లను లాలిస్తూ...

కోడుమూరు పట్టణానికి సమీపాన కొండపై వెలిసిన కొండలరాయుడికి చిన్నా,పెద్దా తేడా లేకుండా తేళ్లను సమర్పిస్తారు. కొండపై వెలిసిన స్వామివారిని దర్శించుకునేందుకు దాదాపు కిలోమీటర్ కాలి నడకన వెళ్లాల్సి ఉంటుంది. ఉదయం నుంచి భక్తులు కొండపైకి బయలుదేరుతారు. అయితే సాయంత్రానికి భక్తులతో కొండ్రాయిన కొండ కిటకిటలాడుతాది. స్వామివారికి వద్దకు వెళ్లే సమయంలోనే తేళ్లవేట మొదలు పెడుతారు భక్తులు. రాళ్ల కింద ఉన్న తేళ్లను పట్టుకుని చేతిలో లాలిస్తూ ముందుకు సాగుతారు. చిన్నారులు సైతం ఏ మాత్రం బెనుకు లేకుండా ఎంతో ప్రేమతో తేళ్లను పట్టుకుని ముచ్చట పడుతారు. మరి కొందరు ఏకంగా నోటి నాలుకపై ఉంచుకుని భక్తిపారవశ్యానికి గురవుతారు. తేలుకు దారం కట్టి తలపై, చేతులపై పారాడిస్తూ తీసుకెళ్లి స్వామివారికి ఉత్సవ విగ్రహంపై వదిలి నైవేద్యం సమర్పించినట్లు మొక్కులు తీర్చుకుంటారు.

తేలు కుట్టినా ఏమి కాదంటున్న భక్తులు

రాళ్ల కింద ఉన్న ఎర్రటి తేళ్లను పట్టుకునే క్రమంలో కుట్టినా ఏమి కాదంటారు కొండరాయుడి భక్తులు. ఒకవేళ తేలుకుట్టినా స్వామి వారి ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేస్తే తగ్గిపోతుందనేది భక్తుల నమ్మకం. దశాబ్దాల తరబడి ఈ వింత ఆచారం కొనసాగుతూనే ఉంది.

కొండలరాయుడి గుడి కట్టించిన భూస్వామి సొరెడ్డి

కోడుమూరు కొండపై వెలిసిన కొండరాయుడు విగ్రహానికి పూర్వం నుంచి భక్తులు పూజలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో 1970లో కోడుమూరుకు చెందిన భూస్వామి సొరెడ్డి తనకు కుమారుడు పుడితే గుడి కట్టిస్తానని స్వామివారికి మొక్కుకున్నాడు. కుమారుడు జన్మించడంతో మొక్కు ప్రకారం గుడి కట్టించాడు సొరెడ్డి. ఆయన వంశీకులు నేటికీ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. కొందరికి ఇంటి దేవుడయ్యారు కొండలరాయుడు. అయితే ప్రతి శ్రావణమాసం మూడవ సోమవారం ప్రత్యేకం.

19న స్వామివారికి ప్రత్యేక పూజలు



వంశపారపర్యంగా వస్తున్న స్వామి వారికి మా వంశస్తులు పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా శ్రావణమాసంలో వచ్చే మూడవ సోమవారం విశేష పూజలు నిర్వహిస్తాం. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఈయేడు 19వతేదీన ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశాం.

– మనోహర్‌రెడ్డి, ఆలయ సంరక్షకుడు

20 నుంచి ఆధార్ క్యాంప్‌లు

కల్లూరు: గ్రామ/వార్డు సచివాలయాల్లో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నామని, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీన ఎ.గోకులపాడు, బస్తిపాడు, తడకనపల్లె, పెద్దపాడు గ్రామాల్లో, 21న పర్ల-2, బొల్లవరం, కొంగనపాడు, పందిపాడు, 22న పర్ల-1, పెద్దటేకూరు, నాయకల్లు, లక్ష్మీపురం-1, 23న కె.మార్కాపురం, పుసులూరు, ఉలిందకొండ-1, లక్ష్మీపురం-2, 24న సల్కాపురం, చిన్నటేకూరు, ఉలిందకొండ-2 గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

నేడు ఇస్కాన్ నగర సంకీర్తన

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక ప్రభు పేర్కొన్నారు. భగీరథ కాంప్లెక్స్‌లోని ఇస్కాన్ మందిరం నుంచి సంకీర్తన బృందం బయలుదేరి నగరంలోని ప్రధాన కూడళ్లలో హరే కృష్ణ హరే రామ జపం చేయనున్నట్లు పేర్కొన్నారు.

25 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రవచకులు వైష్ణో కృప చైతన్య ప్రభు తెలిపారు. 25వ తేదీ ఉదయం 10 గంటల నుంచి శ్రవణ కీర్తన మహోత్సవం, 26వ తేదీ ఉదయం 8 గంటల నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవ వేడుకలు, 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి నందోత్సవం, శ్రీ వ్యాస పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ప్రతిభ చాటిన గురుకులం విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బలరాముడు, ఉపాధ్యాయులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో క్రీడాపోటీల్లో ప్రతిభ చాటారు. ఈ మేరకు శనివారం ప్రతిభ చాటిన విద్యార్థులతోపాటు పీడీ రాఘవేంద్రను, పీఈటీ ప్రభాకర్‌ను ప్రిన్సిపాల్ బలరాముడు, వైస్ ప్రిన్సిపాల్ విజేయుడు, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అండర్ – 15 గర్ల్స్ క్రీడా పోటీలలో పాఠశాలకు చెందిన మూడు జట్లు పోటీపడగా, ఏ జట్టు రెండవ స్థానం, బీ జట్టు మూడవ స్థానం కైవసం చేసుకున్నాయని చెప్పారు. షూటింగ్ బాల్ జిల్లా మీట్‌లో జిల్లా మొదటి స్థానం విజేతగా పాఠశాల విద్యార్థులు నిలిచారన్నారు. విద్యార్థులు అంజినాయక్, అజైయ్ నాయక్, కార్తిక్, జాషువా షూటింగ్ బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. అదేవిధంగా రోప్‌స్కిపింగ్‌లో రాష్ట్ర స్థాయి పోటీలో పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. 8వ తరగతి విద్యార్థి ఉదయరాజుకు గోల్డ్, ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు శాంతిరాజు, వినయ్‌కి సిల్వర్, 8వ తరగతి విద్యార్థి దీపక్‌రాజు బ్రౌంజ్ మెడల్ పొందినట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే ఉపేక్షించం

- సీఐ ఎండీ తబ్రేజ్



సి.బెళగల్ పోలీస్‌లకు సూచనలు ఇస్తున్న సీఐ ఎండీ తబ్రేజ్

సి.బెళగల్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైన ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని కోడుమూరు సీఐ ఎండీ తబ్రేజ్ హెచ్చరించారు. సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌ను శనివారం సీఐ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన సీఐ పెండింగ్ కేసుల వివరాలను ఎస్‌ఐ తిమ్మారెడ్డి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. మట్కా, పేకాట, ఇసుక, మద్యం అక్రమ తరలింపులపై కఠినంగా వ్యవహరించాలని ఎస్‌ఐకి ఈ సందర్భంగా సీఐ సూచించారు. స్టేషన్ ఆశ్రయించిన బాధితుల సమస్యలపై సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఏవైనా సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం అందజేసి సహకరించాలని ప్రజలకు సూచించారు. ఇలాంటి సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామని, శాంతిభద్రతల సంరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సీఐ ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప, కానిస్టేబుల్ సుధర్శణం, మహిళా కానిస్టేబుల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మల్లీశ్వరిని సన్మానిస్తున్న ఉద్యోగులు, నాయకులు

ఓర్వకల్లు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓర్వకల్లు మండలం ఎంపీడీఓగా విధులు నిర్వర్తించి సొంత జిల్లాకు బదిలీ అయిన మల్లీశ్వరిని శనివారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు ఆమెకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు నాగరాజు, అబ్దుల్లా, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే చక్కటి భవిష్యత్తు



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కోడుమూరు రూరల్: విద్యతోనే పేద విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని బయో స్టాడ్ ఇండియా లిమిటెడ్ ఆర్‌ఎం వరప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని ప్యాలకుర్తి హైస్కూల్‌కు చెందిన పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2, 500 చొప్పున బయోజెమ్ కంపెనీ ప్రతినిధులు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈసందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబాలకు చెందిన విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్న ఉద్దేశంతో చదువులో రాణించే విద్యార్థులకు కంపెనీ స్కాలర్‌షిప్‌లను అందజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మారుతి, విద్యా కమిటీ చైర్మన్ షేక్షావలి, కంపెనీ ప్రతినిధులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి



ఓపెన్ స్కూల్ పోస్టర్ విడుదల చేస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

పాణ్యం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ ఏపీ ఓపెన్ స్కూల్ ఓరియంటేషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. పదవ తరగతి, ఇంటర్ ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో పాటు, విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. పాఠశాల ఆవరణాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం, ఆసీర్‌పీలు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ ఘటనపై వైద్యుల నిరసన



పోలకల్‌లో నిరసన తెలుపుతున్న వైద్య అధికారులు, సిబ్బంది



పాణ్యంలో నిరసన తెలుపుతున్న డాక్టర్లు



పాణ్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

పాణ్యం: పశ్చిమ బెంగాల్‌లో వైద్య పీజీ విద్యార్థినిని అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం పాణ్యం సీహెచ్‌సీ డాక్టర్లు నిరసన చేపట్టారు. సీహెచ్‌సీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పాణ్యం బస్టాండ్‌లో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రహేలా మాట్లాడుతూ నిందితులను బహిరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంఓల డాక్టర్లు సునీల్‌బాబు, చంద్రప్రకాష్, రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పాణ్యం: పశ్చిమ బెంగాల్‌లో వైద్య పీజీ విద్యార్థిని మామిత హత్యాచార ఘటనపై శనివారం పాణ్యం ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. పాణ్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి నిరసన చేపట్టారు. వైద్యులకు రక్షణ కల్పించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. హత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు శివక్రిష్ణ, ఏఐఎస్‌బీ నాయకుడు వనం వెంకటాద్రి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బత్తిన ప్రతాప్, రాజు, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం ఘటనపై శనివారం సి.బెళగల్ మండలంలోని పోలకల్ పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యులకు రక్షణ కల్పించాలని, వైద్యురాలిపై ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ముడుమాల రోడ్డు, కూడలిలో సైతం నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, పద్మావతి, స్టాఫ్ నర్సు కల్యాణి, ల్యాబ్ అసిస్టెంట్ జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: కలకత్తాలో జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి డా.భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఘటనను నిరసిస్తూ శనివారం కోడుమూరు, లద్దగిరి పీహెచ్‌సీల ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. ప్లకార్డులు చేతబూని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా డా.భాస్కర్ మాట్లాడుతూ నిత్యం ఎన్నో కష్టనష్టాలోర్చి ప్రజలకు వైద్య సేవలందించే వైద్యులపై దాడులు, హత్యలు చేయడం దారుణమన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థినీ ఆత్మకు శాంతి కలగాలని వారు ప్రార్థించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శాంతమ్మ, సూపర్‌వైజర్ శారద, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచికలపాడులో...

కలకత్తాలో వైద్య విద్యార్థినీ హత్యను నిరసిస్తూ గూడూరు మండలంలోని పెంచికలపాడు విశ్వభారతి వైద్య కళాశాలలో విద్యార్థులు, సిబ్బంది నిరసన తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలంటూ వైద్య విద్యార్థులు, సిబ్బంది కళాశాల ముందు ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మునిరుద్దీన్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: కలకత్తాలో వైద్య విద్యార్థినీపై హత్యాచారాన్ని ఖండిస్తూ శనివారం భారత వైద్య సంఘాల పిలుపు మేరకు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్య ఆరోగ్య సిబ్బంది పెద్దఎత్తున నిరసన తెలిపారు. స్థానిక ఆసుపత్రి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని డాక్టర్ మంజుల మాట్లాడుతూ కలకత్తాలోని ఆర్‌జీ కల్ వైద్య కళాశాలలో పీజీ విద్యార్థిని హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



కోడుమూరు పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



పెంచికలపాడు విశ్వభారతి వైద్య కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు



ఓర్వకల్లులో మాట్లాడుతున్న డాక్టర్ మంజుల

క్యాంటిన్‌లలో పౌష్టికాహారం అందిస్తాం

కల్లూరు: అన్న క్యాంటిన్‌లలో పౌష్టికాహారం అందిస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ పరిధిలోని పరిమళ నగర్‌లో ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటిన్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే అన్న క్యాంటిన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అదేవిధంగా కల్లూరు అర్బన్ పరిధిలోని వీకర్‌సెక్షన్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తనిఖీ చేశారు.

భూసార పరీక్షలతో లాభాలు



భూసార పరీక్షల కార్డులను రైతులకు అందజేస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: భూసార పరీక్షలు చేయించుకుంటే రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని కోడుమూరు ఏఓ రవిప్రకాష్ సూచించారు. శనివారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ, మోడరన్ ఆర్కిటెక్ట్స్ ఫర్ రూరల్ ఇండియా ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా భూమికి అవసరమైన ఎరువులు, మందులను మాత్రమే వేసుకోవచ్చునన్నారు. అనుకూలమైన విత్తనాల పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చునన్నారు. ప్రస్తుతం పంటలన్ని పూత, కాయ దశకు చేరుకుంటున్నాయని, రైతులంతా ప్రతి రోజు పొలాలను పరిశీలిస్తుండాలన్నారు. ఏవైనా తెగుళ్లు, పురుగు ఉన్నట్‌లెతై వెంటనే మందులను పిచికారీ చేసుకోవాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో ఎంఏఆర్‌ఐ సిబ్బంది ఉపేంద్ర, జాన్సీ, లలిత, వీపీఏ ఆఫ్రీన్ పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలోని మెన్స్, ఉమెన్స్ హాస్టళ్లలో మెరుగైన వసతుల కల్పనకు అందరూ కృషి చేయాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ అన్నారు. శనివారం వర్సిటీ సెనేట్ హాల్‌లో హాస్టల్స్ చీఫ్ వార్డెన్, వార్డెన్, డిప్యూటీ వార్డెన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ అనుబంధ హాస్టళ్లన్నింటిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. హాస్టళ్ల సమస్యలపై విద్యార్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. వర్సిటీ ప్రాంగణంలో విద్యార్థులు ఎప్పుడు పడితే అప్పుడు రాకపోకలు సాగించకుండా చూడాలన్నారు. నిర్దీత సమయం వరకే హాస్టళ్లలోకి అనుమతించాలన్నారు. హాస్టళ్లలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. హాస్టళ్లల్ ఉద్యోగులు అందరూ ఏమాత్రం అలసత్వం లేకుండా సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. హాస్టళ్లలోని నీటి కొరత సమస్యను జిల్లా మంత్రుల దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. కర్నూలు నగర పాలక సంస్థకు రూ.80 లక్షలు చెల్లించి పైపులైను నిర్మాణం చేపట్టినా నీటి సరఫరా కావట్లేదన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, చీఫ్ వార్డెన్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, వార్డెన్ డాక్టర్ వై.హరిప్రసాదరెడ్డి పాల్గొన్నారు.